

సామాన్యుడి ఆయుధం
# తెలంగాణ ప్రభ
డిజిటల్
సోమవారం, ఆగస్టు 05, 2024





## సిరిసిల్ల నేతన్నల పరిస్థితులు చక్కదిద్దుతాం

- నిర్మాణాత్మకంగా శాశ్వత పరిష్కారం
- సమస్యల మూలాలు తెలుసు..
- కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డితో 'తెలంగాణ ప్రభ' ప్రత్యేకం

నడుస్తున్న మర మగ్గం ఆగిన స్థితిని, చిక్కుబడిన నేత బతుకుల వ్యథల్ని చూసి చలించిన వాడు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను సంక్షోభల్లోకి నెట్టివేసిన పరిస్థితులపై అంచనా ఉన్నవాడు. పడుగు పేకల జీవితాల్లో కన్నీళ్లు తుడిచి, వెలుగులు నింపి కొత్తదారులు వేసేందుకు ప్రభుత్వం ఆలోచనలో ఉన్న విషయాలను కేకే మహేందర్‌రెడ్డి విడమర్చి చెప్పారు. 'తెలంగాణ ప్రభ'తో పంచుకున్నారు.

తెలంగాణ ప్రభ ప్రతినిధి

2లో


# వస్త్ర పరిశ్రమకు వన్నె తెస్తాం

WANTED

సమాజంపై అవగాహన, బాధ్యత కలిగి నిజాన్ని నిర్భయంగా రాయగలిగి, మంచికోసం పని చేయ గలననే నమ్మకం ఉన్న ప్రతి ఒక్క రిపోర్టర్‌కి 'తెలంగాణ ప్రభ డిజిటల్ పత్రిక' ఆహ్వానం పలుకుతుంది. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం.. కొత్త వారికి అవకాశం కల్పిస్తున్నది.

ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి
సెల్: 99854 44342

# వస్త్ర పరిశ్రమకు వన్నెతెస్తాం



- సిరిసిల్ల నేతన్నల పరిస్థితులు చక్కదిద్దుతాం
- నిర్మాణత్మకంగా శాశ్వత పరిష్కారం
- సమస్యల మూలాలు తెలుసు..
- కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డితో 'తెలంగాణ ప్రభ' ప్రత్యేకం



**నడుస్తున్న మర మగ్గం ఆగిన స్థితిని, చిక్కుబడిన నేత బతుకుల వ్యధల్ని చూసి చలించిన వాడు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను సంక్షోభల్లోకి నెట్టివేసిన పరిస్థితులపై అంచనా ఉన్నవాడు. పడుగు పేకల జీవితాల్లో కన్నీళ్లు తుడిచి, వెలుగులు నింపి కొత్తదారులు వేసేందుకు ప్రభుత్వం ఆలోచనలో ఉన్న విషయాలను కేకే మహేందర్‌రెడ్డి విడమర్చి చెప్పారు. 'తెలంగాణ ప్రభ'తో పంచుకున్నారు.**

తెలంగాణ ప్రభ ప్రతినిధి

**శాశ్వత పరిష్కారం దిశగా..**

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమగ్ర అభివృద్ధి దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. మూడు దశాబ్దాలుగా సిరిసిల్ల పరిశ్రమ గమనాన్ని పరిశీలిస్తే అనేక విషయాలు అవగతం అవుతాయి. సమస్యల మూలాల నుంచి సమగ్రంగా కొత్తచూపుతో ఆలోచించాల్సి ఉంది. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఆలోచనలు పరిశీలించాలి. బతుకమ్మ చీరల తరహాలో కాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇతర ఆర్డర్లు ఇస్తుంది. నూలు బ్యాంకు ద్వారా ప్రభుత్వమే నూలు అందిస్తుంది. కాంగ్రెస్ హయాంలోనే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు విద్యుత్ రాయితీలు అందించిన విషయం గమనంలో ఉంచుకుంటే.. రానున్న రోజుల్లోను పరిశ్రమకు ఉతం అందించే విధంగా ఉంటుంది. విద్యుత్ పరిశ్రమకు అందించి సబ్సిడీ విషయంలో నాలుగో కేటగిరి నుంచి మూడో కేటగిరికి మార్చి విద్యుత్ బిల్లులు వసూలుకు శ్రీకారం చుట్టింది గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వమే. పెంచిన బిల్లులకు కూడా సబ్సిడీ 50శాతం సబ్సిడీ ఈ ప్రభుత్వమే ఇస్తుంది. కష్టకాలంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ బతుకమ్మ చీరలకు సంబంధించి రూ.275 కోట్ల బకాయిలను గత ప్రభుత్వం బకాయి పెట్టి పోతే రూ.100 కోట్ల పైగా చెల్లించింది రేవంత్ రెడ్డి ప్రభుత్వమే. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమంలోని కాటన్, పాలిస్టర్ తో పాటు మిగిలిన అన్ని రంగాల వారికి ఉపాధి కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు ఇప్పటికి మొదలు పెట్టింది. పరిశ్రమలోని కార్మికుల నుంచి మొదలై పారిశ్రామిక దాకా సమూలంగా మార్పులు చేసి ఆధునికత వైపు నడిపిస్తూ నేతన్నలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారంగా కాకుండా ఆచరణగా మొదలై కొత్తదారులు వేస్తుంది.



సంక్షిప్తంగా కేకే మహేందర్ రెడ్డి పరిశ్రమలోని అనేక అనుభవాల నుంచి వచ్చిన పాటవాలను ఈ సందర్భంగా 'తెలంగాణ ప్రభ'తో పంచుకున్నారు. నిశ్శబ్దంలోని సుదీర్ఘ ఆలోచనలు సమస్యలకు పరిష్కారం వెతుకుతు నేతన్నలను ఆర్థికంగానే కాకుండా ఆత్మ గౌవరంతో నిలబెట్టాలనే కేకే సంకల్పం గొప్పది.



## ఫలించిన చర్చలు..

### దీక్ష విరమించిన నేతన్నలు

**నిమ్మరసం అందజేసి దీక్ష విరమింపజేసిన : అదనపు కలెక్టర్**

**తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) :** కొద్దిరోజులుగా సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నేతన్నలు చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారం విరమించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నేతన్నల సమస్యలపై ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్, సెస్ చైర్మెన్ చిక్కాల రామారావుతో కలిసి చర్చించిన అనంతరం అదనపు కలెక్టర్ సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో దీక్ష స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నేతన్నలకు నిమ్మరసం అందజేసి దీక్ష విరమింపజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల వస్ర పరిశ్రమ సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ప్రకటించారు. పరిశ్రమ తరపున ఇచ్చిన డిమాండ్స్ ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు.



## జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలి

**పర్శ హనుమండ్లు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి**

**తెలంగాణ ప్రభ (సిరిసిల్ల) :** జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిది పర్శ హనుమండ్లు అన్నారు. ఆదివారం సిరిసిల్లలో నిర్వహించిన సమావేశంలో ఓబీసీ సంక్షేమ సంఘం అఖిలభారత మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హనుమండ్లు మాట్లాడుతూ తంజావూరులో ఆగస్టు 7న అఖిల భారత మహాసభలు నిర్వహించినున్నట్లు తెలిపారు. భవిష్యత్ కార్యాచరణ పై మహాసభల్లో చర్చ ఉంటుందని అన్నారు. మహాసభలను విజయవంతం చేయాల్సిందిగా కోరారు. సమావేశంల బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వీరవేని మల్లేశం యాదవ్. కంచర్ల రవి గౌడ్. తాడుక కమలాకర్ .రామా గౌడ్. కోడం రవీందర్. కొండ విజయ్. తిరుపతి. శ్రీనివాస్. బచ్చు ప్రసాద్. శ్రీధర్. వడ్ల తిరుపతి. తదితరులు పాల్గొన్నారు.


## సిరిసిల్ల పట్టణ సీఐ కృష్ణను కలిసిన ఆటో యూనియన్

**తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) :** పట్టణ సీఐ కృష్ణను ఆదివారం టాటా మ్యాజిక్ యూనియన్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆత్మీయంగా సత్కరించారు ఈ సందర్భంగా సిఐ కృష్ణ మాట్లాడుతూ టాపిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో టాటా మ్యాజిక్ యూనియన్ అధ్యక్షులు వల్లాల వెంకటే శం, ఉపాధ్యక్షులు పాముల రాజేందర్, ప్రధాన కార్యదర్శి ఎల్లే సత్యనారాయణ, కోశాధికారి విశ్వనాధుల వినోద్ కుమార్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.




## జూకంటికి నాగుల మల్లయ్య స్మారక పురస్కారం

**తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) :** సాహితి వేత్త, ప్రముఖ రచయిత జూకంటి జగన్నాథంకు నాగుల మల్లయ్య స్మారక పురస్కారం వరించింది. ఆదివారం సిరిసిల్లలో నిర్వహించిన నాగుల మల్లయ్య స్మారక పురస్కారాన్ని ప్రభుత్వం విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డి పురస్కార కమిటీ నిర్వాహకుల చేతుల మీదుగా జూకంటి పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, సంగీతం శ్రీనివాస్, గడ్డం నరసయ్య, నాగుల సత్యనారాయణ గౌడ్, ఎండి సలీం, నాగుల సంతోష్ పాల్గొన్నారు.



## శ్రీచైతన్య సాగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడిగా రవిసింగ్

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** షాపూర్ నగర్, గాజులరామారం లోని శ్రీ చైతన్య సాగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీ ఏర్పాటు చేసుకోవడం జరిగింది. భవన నిర్మాణ కార్మిక కమిటీలో ఎన్నో రోజుల నుంచి కార్మికుల పట్ల అండగా ఉంటూ కార్మికులకు ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడికి వెళ్లి న్యాయం చేసిన బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు రవి సింగ్ ను ఏకగ్రీవంగా శ్రీ చైతన్య సాగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, ఈ కమిటీలో ఉప అధ్యక్షునిగా ఏం విట్టల్, రాజు సాగర్, ప్రధాన కార్యదర్శి సహదేవ్, అఖిల్ షేక్, కోశాధికారి బాబూజీ, తలారి దుర్గయ్య, నాగరాజు, డేవిడ్ రాజు, ఆర్గనైజర్ గా స్వామి, రమేష్ సాగర్, మాణిక్యం, నరసింహ, దాస్, అడ్వైజర్స్ పాండు సాగర్ ఎం.శ్రీను, ఎస్.శ్రీను,కమిటీ సభ్యులు పరశురాం, ఎం.రఫీ, రాము, లంబాడి రమేష్, రవి నూతన కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమం తర్వాత జెండా ఆవిష్కరణ కమిటీ సభ్యులతో మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, శ్రీ చైతన్య సాగర్ భవన నిర్మాణ కార్మిక కమిటీ సభ్యులు స్థానిక కార్మికలు తదితరులు పాల్గొన్నారు.



# సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యల పరిష్కారానికి కృషి

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

### సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం సానుకులం



**తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) :** సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్ టైల్స్, సెస్ చైర్మన్, అధికారులు, పవర్ లూమ్ యజమానులు, ఆసాములతో ఆదివారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పవర్ సబ్సిడీ, కోర్టులో కేసు, ఎస్ ఎస్ ఐ యూనిట్ల అంశాలపై చర్చించారు. అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యల పరిష్కారం పై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని, సమస్యల పరిష్కారానికి సర్కార్ కట్టుబడి ఉందని ఆ దిశగా ముందుకెళ్తుందని స్పష్టం చేశారు. ఇప్పటికే పలుమార్లు బతుకమ్మ చీరల బకాయిలు విడుదల చేసిందని గుర్తు చేశారు. అలాగే స్కూల్ యూనిఫాం క్లాత్ ఆర్డర్ ను కూడా అందజేసిందని వివరించారు. కోర్టు పరిధిలో ఉన్న అంశాలు మినహా అన్ని సమస్యలు పరిష్కరిష్కారానికి కృషి చేస్తానని భరోసా కల్పించారు. ఇప్పటికే ఇదే విషయమై పలుమార్లు చర్చించామని ముఖ్యమంత్రి, మంత్రితో చర్చించామని గుర్తు చేశారు. ఇతర రాష్ట్రాల్లో పవర్ లూమ్ పరిశ్రమకు అందిస్తున్న రాయితీలు ప్రోత్సాహకాలపై ప్రభుత్వానికి నివేదిస్తామని భరోసా కల్పించారు. ఇదే విషయమై మరో సారి చర్చిస్తామని విప్ ప్రకటించారు. పవర్ లూమ్ పరిశ్రమలో విద్యుత్ సబ్సిడీ సమస్య పరిష్కరిస్తామని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు హామీ ఇచ్చారు. ఇక్కడ అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్ టైల్ శాఖ ఏడీ సాగర్, పవర్ లూమ్ యజమానులు, ఆసాములు తదితరులు పాల్గొన్నారు





## వస్త్ర పరిశ్రమను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

### జేఏసీ దీక్షలకు మద్దతు

**తెలంగాణ ప్రభ, (రాజన్న సిరిసిల్ల బ్యూరో) :** సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం అంబేద్కర్ చౌరస్తాలో వస్త్ర పరిశ్రమ జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరిసిల్లలో చేనేత వృత్తిదారుల పరిస్థితులు దయనీయంగా ఉన్నాయని అన్నారు. సమస్యల్లో కూరుకుపోయిన వస్త్ర పరిశ్రమ కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. వేల కుటుంబాలు మర నేత వృత్తి జీవనాధారంగా ఉందని అన్నారు. సిరిసిల్ల పరిశ్రమ విషయంలో అసెంబ్లీలో కూడా ప్రస్తావించడం జరిగిందని తెలిపారు. మినిమం వేజ్ చట్టం ద్వారా కల్పించిన భద్రత విషయం ఇక్కడ ఆచరణకు నోచని పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నారు. వస్త్ర పరిశ్రమ జేఏసీ అడుగుతున్న న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించవలసిందిగా కోరారు. ఉపాధి, విద్యుత్ సబ్సిడీ అంశాలను పట్టించుకోని పరిశ్రమను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆధునికతవైపు నడిపించాల్సిందిగా కోరారు. దీక్షలో వస్త్ర పరిశ్రమ జేఏసీ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, కడారి రాములు, సీపీఎం నాయకులు రమేష్, గణేష్ పలువురు వస్త్ర పరిశ్రమ జేఏసీ తాటిపాముల దామోదర్, మండల సత్యం, ఎనుగుల ఎల్లయ్య నాయకులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన నిర్వాహకులపై డీఈఓ ఆగ్రహం

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** కోటగిరి మండల పరిధిలోని కొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ సందర్శించారు. శనివారం నాడు విద్యార్థులకు కారంపొడితో మధ్యాహ్న భోజన నిర్వాహకులు అన్నం వడ్డించడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులతో, విద్యార్థులతో మాట్లాడుతూ పలు విషయాలు తెలుసుకొని మధ్యాహ్న భోజన నిర్వహకులపై మండిపడ్డారు. భోజనం వండాలంటే రుచికరమైన వంటలను వండి వడ్డన చేసి విద్యార్థులకు భోజనం పెట్టాలని ఆదేశించారు. లేనియెడల ఏజెన్సీని రద్దు చేసి కొత్తవారిని నియమించడం జరుగుతుందని గ్రామస్తుల సమక్షంలో ఏజెన్సీ నిర్వాకురాలకు హెచ్చరించారు. పాఠశాల ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజనం చేసే ముందు ప్రతిరోజు ఒకరు ఇన్చార్జ్ తీసుకొని మధ్యాహ్న భోజనం విద్యార్థులకు రుచికరమైన వంటలు చేసి నిర్వాకులతో వడ్డన చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈఓ నాగనాథ్ తహశీల్దార్ కే. గంగాధర్ మాజీ స్కూల్ కమిటీ చైర్మన్ పువ్వుల దత్తాత్రి గ్రామస్తులు తదితరులు ఉన్నారు.




## యువకులు అథ్లెటిక్స్‌లో భాగస్వామ్యులయ్యేలా కృషి చేయాలి

### ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** దూలపల్లి లోని సెంట్ మార్టిన్స్ కళాశాలలో నిర్వహించిన నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే కె.పి వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.పి వివేకానంద మాట్లాడుతూ జాతీయస్థాయిలో అథ్లెటిక్స్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఇలా సన్మానిస్తూ కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, అథ్లెటిక్లో యువకులను ప్రోత్సహించేందుకు నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మర్రి లక్ష్మణ్ రెడ్డి చేస్తున్న కృషి ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం అథ్లెటిక్స్ లో జాతీయస్థాయిలో మొదటి,



ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన 150 మంది అథ్లెటిక్స్ కు నగదు ప్రోత్సాహకం అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ప్రభు కుమార్, కోశాధికారి డి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రేపు ప్రజా యుద్ధనౌక గద్దర్ ప్రథమ వర్ధంతి సభ

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** ప్రజా యుద్ధనౌక వాగ్గేయికారుడు, దివంగత నేత గద్దర్ ప్రథమ వర్ధంతిని ఈ నెల 6వ తేదీన మధ్యాహ్నం 2గంటలకు రవీంద్ర భారతిలో జరుగుతుందని, ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని గాజులరామారంలో కవులు, కళాకారులు కలిసి వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దరువు అంజన్న, ప్రముఖ కవి జర్నలిస్టు మోహన్ బైరాగి పాత్రికేయులు డప్పు రామస్వామి, జోగు వెంకట్, నాగుల సాయి, రాగాల ఆనంద్, రమేష్, రవీందర్, సాయి పాల్గొన్నారు.



## సమస్యలను పరిష్కరించేలా కృషి : మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** పదేండ్ల బీఆర్ఎస్ పార్టీ పాలనలో బాధితులైన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. షాపూర్ నగర్ లోని తన నివాసం వద్ద ప్రజలు, కార్యకర్తల నుండి మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ వినతులు స్వీకరించారు. తమ సమస్యలు చెప్పుకునేందుకు వివిధ బస్తీల నుండి ప్రజలు, భాదితులు శ్రీశైలం గౌడ్ నివాసానికి వచ్చారు. అందరి సమస్యలు పరిష్కరిస్తానని మాజీ ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు. బహదూర్ పల్లి, గుబురుగుట్ట కాలనీల నుండి ఆయా సంక్షేమ సంఘాల ప్రతినిధులు తమ కాలనీల్లో నెలకొన్న సమస్యలు మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సంబంధిత అదికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. పలువురు పలు ఆహ్వాన పత్రికలు అందజేశారు.



# ఆత్మీయ మిత్రులను అందించిన చిన్మయ



వాళ్లు పుట్టడమే స్వర్గంలో పుట్టారని అనుకుంటారట... ఇంతకీ వాళ్ళు ఎవరు స్వర్గంలో పుట్టడం ఏంటని మీరు ఆశ్చర్యపోవచ్చు... గోదావరిఖని ఫెర్టిలైజర్ సిటీ ఎరువుల కర్మాగారం లో పనిచేసే ఉద్యోగస్తుల పిల్లలు (చిన్మయ విద్యార్థులు 1995 బ్యాచ్ )చెబుతున్న మాటలివి. వారి స్నేహానికి ఇప్పుడు మూడు పదులు దాటింది. అయినా కూడా చిన్ననాటి వారి స్నేహ పరిచయం కాలంతో పాటు ఈ రోజు వరకు కూడా పయనిస్తూనే ఉంది. ఇంతకీ వీరి స్నేహానికి బీజం ఎక్కడ  పడిందంటే.. ఎటువంటి టెక్నాలజీ సోషల్ మీడియా స్మార్ట్ ఫోన్లు లేనికాలంలో చిన్మయ విద్యాలయంలో వీరి స్నేహానికి పునాది పడింది. ఎడారిలో వాన చినుకు పడితే ఆ నేల ఎంత పులకరిస్తుందో అదే విధంగా  ఆరోజు మొదలైన వారి స్నేహపు మనసులు కూడా వెల కట్టలేని బంధాలను ఆ వాతావరణంలో వాళ్లు సంపాదించుకున్నారు. అందుకే ఆ నేల వారికి స్వర్గంతో సమానమట.. తల్లిదండ్రుల తర్వాత మన జీవితంలోకి మరింత దగ్గరయ్యే వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే ఖచ్చితంగా అది ఒక స్నేహితుడు మాత్రమే.. బడి ఒక్క అక్షరాలనే నేర్పించదని అంతకంటే గొప్ప ఆత్మీయ మిత్రులను కూడా మనకు అందిస్తుందని చెప్తున్నారు. వారికి 'చిన్మయ' అంటే మార్కుల సర్టిఫికెట్ ఇచ్చిన బడి ఒకటే కాదు. ఒక జ్ఞాపకాల నిధి..  స్నేహితులతో గడిపిన గతాన్ని కళ్లముందు కనిపించేలా వారి గుండె చప్పుడు బడి గంటల కొట్టుకునేలా మారిందని ఇప్పటికీ వారి స్నేహం ఆనాడు స్నేహితులతో కలిసి తిన్న పల్లిపట్టిలంతా తియ్యగానే ఉన్నదని ఈ స్నేహితుల దినోత్సవం రోజు వారు వారి స్నేహాన్ని గుర్తు చేసుకున్నారు.

### కళ్ల కంటే ముందే.. గుండె ఏడుస్తుంది..

విచిత్రం ఏంటంటే ఆనాడు కాలం కాటేసి నాటి ఎరువుల కర్మాగారం మూతపడితే బరువెక్కిన గుండెలతో కార్మికులు వెళ్లిపోయినా ఆ పిల్లల స్నేహం మాత్రం ఆ పరిసరాలను కలిసి తిరిగిన చోటును చదువుకున్న స్కూలును మర్చిపోలేదు. ఎక్కడెక్కడో స్థిరపడ్డ వారి స్నేహితులను వెతుక్కుని ఒకటయ్యారు. 'మన' అనే పదానికి ఒక అర్థం ఒక్క స్నేహ బంధమేనేమో. అందుకే ఒక గూటికి చేరారు. స్నేహంలో  కొట్టుకోవడం, తిట్టుకోవడం, నవ్వుకోవడం పంచుకోవడం ఇలా అన్నీ ఉంటాయి.. కానీ నిజమైన స్నేహానికి విడిపోవడం అనేదానికి స్థానం లేదు. స్నేహితుడు కష్టాల్లో ఉన్నాడంటే కండ్ల కంటే ముందు గుండె ఏడుస్తుంది. మన కష్టాలు స్నేహితులు తీర్చకపోవచ్చు కానీ వారి స్పర్శ ఓదార్పు, నమ్మకం, ధైర్యం ఆ చిన్ని గుండెకు చెప్పలేనంత బలాన్నిస్తుంది. ఈ కాలపు స్నేహం మాత్రం డబ్బుతో మాత్రమే ముడి పడిందని ముమ్మాటికీ చెప్పొచ్చు. కులాలు, మతాలు చూసి స్నేహం చేసేవారు కొందరైతే.. అందం చదువు, సందప చూసి స్నేహం చేసేవారు ఇంకొందరు.

### మంచి మార్గంలో నడిపించే ఒక్క స్నేహితుడు కరువు..

ఇది కాదు కదా స్నేహమంటే.. రక్త బంధాన్ని కూడా జయించగలిగేది స్నేహబంధం. ఇప్పటి స్నేహం మాత్రం ఫేస్ బుక్, ఇన్ స్టా గ్రామ్, వాట్సాప్, పలు సోషల్ మీడియా వేదికలతో పోటీ పడుతుంది. లెక్కలేని మంది స్నేహితులను సంపాదిస్తున్నారని అందులో ఒక్కరు కూడా ఆపదలో ఆదుకోనికి ముందుకు రారు. అలా రాకపోగా ఇంకా ఈర్షలు, ద్వేషాలు పెంచుకొని ఒకరికొకరు చంపుకునే పరిస్థితికి వచ్చారు. అవసరాలకి స్నేహాలు చేయడం ఇప్పటి వారికి అలవాటైపోయింది. స్నేహానికి రంగులద్ది ముసుగేసి విషపు కత్తితో ఆ బంధాన్ని నరికేసే రోజులు ఇవి. ఇప్పటి యువతకి సినిమాలకి, పబ్బులకి, జల్సాలకి జత కట్టడానికి స్నేహం ఉపయోగపడుతుంది కానీ మంచి మార్గంలో నడిపించే ఒక్క స్నేహితుడు కూడా దొరకడం అంటే కష్టతరమైన విషయమే.

### మంచి మిత్రుడిని సంపాదించుకోవడం కష్టమే..

మన మరణంలో కూడా మొదట గుర్తుకు వచ్చే వాటిల్లో ముందుండేది మన స్నేహితులతో గడిపిన మధురానుభూతులు.. ఒక మంచి స్నేహితుడు ఉంటే నువ్వే నిజమైన ఆస్తిపరుడువి.. ప్రస్తుత సమాజంలో కోట్లు సంపాదించడం సులువే కావచ్చు.. కానీ ఒక్క మిత్రున్ని సంపాదించుకోవడమంటే కష్టమే.. ముందు ముందు అలసిపోయే మన జీవితాలకి స్నేహం ఒక ఔషధమని ఇప్పటి వారికి అర్థం కాదు. సంపదలోని సర్వం వెతుక్కునే ఇప్పటి వారికి నాటి స్నేహం ఒక పాఠం కావాలి.. ఒక గుణపాఠంగా మారాలి.. అన్ని బంధాల విలువలు తెలియాలంటే స్నేహబంధంతోనే మొదలు కావాలి. అది మాత్రమే నేర్పించగలదు.

**ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా**

**నా మిత్రుల యాదిలో..**


**తుమ్మల కల్పనరెడ్డి**

రచయిత

+91 9640 462 142




# అపూర్వ సమ్మేళనం



**తెలంగాణ ప్రభ (గుమ్మడవెల్లి) :** 'స్నేహితుల దినోత్సవం' సందర్భంగా ఆదివారం గుమ్మడవెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 2001-2002 విద్యా సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు పాలొని తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఉద్యోగ, వ్యాపార రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన విద్యార్థులంతా ఎంతో ఉత్సాహంతో తమ పాఠశాలకు చేరుకొని గత స్మృతులను నెమరు వేసుకున్నారు. ప్రత్యేకించి వారు తమకు విద్యాబుద్ధులు నేర్పి నేడు సమాజంలో ఉన్నత స్థానంలో నిలిచేలా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి తమ భక్తిప్రపత్తులను చాటుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి కోట దామోదర్, ఏ మాత్రం ప్రాథమిక విద్య లేకుండా తోటమాలి నుండి ప్రపంచ ప్రఖ్యాత కార్డియాలజిస్ట్ గా మారిన డా హ్యామిల్టన్  నాకీ పై వ్యాసకర్త యేచన్ చంద్ర శేఖర్ రచించిన 'మలుపు తిప్పిన ఎస్ సర్' అనే స్ఫూర్తివంతమైన ఆర్టికల్ గురించి ఈ సందర్భంగా సభికులకు క్లుప్తంగా వివరించారు. ఇది పూర్వ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులను కూడా ఎంతో సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. ఈ సందర్భంగా ఇతర పూర్వ విద్యార్థులు కూడా తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్తయ్య సార్, శ్రీధర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రకాష్ సార్, హనుమంత్ రావు, రాంచందర్ రావు ,అంజయ్య , కిరణ్, వెంకన్న గురువులు పాలొన్నారు.  పూర్వ విద్యార్థి కోట దామోదర్ అధ్యక్షత వహించారు కార్యక్రమం నిర్వహించగా.. శ్రీకాంత్, రుద్ర శ్రీనివాస్, రవి, రమేష్, యాకయ్య, సంధ్య, సైదమ్మ, సుహాసిని, ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.